


# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక




సంపుటి: 01 సంచిక : 246. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ గురువారం.19.06.2025 పేజీలు:4, వెల:రూ.1.00

## ఊరికో బస్సు.. ఇంటికో దీపం..

మధిర :అమృత్ తెలంగాణ: "ఊరికో బస్సు, ఇంటికో దీపం.." నినాదంతో ఆనాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి కాలం నుంచి ఇప్పటి ప్రజాప్రభుత్వ పాలన వరకు రాష్ట్రంలో అభివృద్ధికి బాటలు వేశామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా మధిరలో రూ.10 కోట్లతో నిర్మించనున్న కొత్త బస్టాండ్ పనులకు మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం 10 కొత్త బస్సులను ప్రారంభించారు. ముందుగా బోనకల్ మండలం జానకీపురం సబ్ స్టేషన్‌లో ఆర్‌టీఎఫ్ఎంఎస్, ఎఫ్‌పీఐ వ్యవస్థలను ప్రారంభించారు. అనంతరం మధిరలో ఏర్పాటు చేసిన సభలో భట్టి మాట్లాడారు. ఊరికో బస్సు నినాదంతో రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యాన్ని కల్పించాలని, ఇంటికో దీపం పేరుతో ప్రతి ఇంట్లో విద్యుత్ వెలుగులు విరజిమ్మాలనేది కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఈ పదేండ్లు అధకారంలో ఉన్న బీఆర్ఎస్ ఆర్టీసీని నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. నిజంగా ప్రజల పట్ల నిబద్ధత, ఆలోచన ఉన్నవారే ప్రజలకు మేలు జరిగే సౌకర్యాలు కల్పిస్తారని, అందుకే రాష్ట్రంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన టీజీఎస్ఆర్టీసీ నిలదొక్కుకొని లాభాల బాట పట్టించేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ నిత్యం కృషి చేస్తున్నారని తెలిపారు.

మహిళలను గౌరవించుకునేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించా మన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో మహిళలకు 186 కోట్ల జీరో టికెట్లు జారీ చేయగా రూ.6,250 కోట్లు ఆర్థిక శాఖ ఆర్టీసీకి చెల్లించాల్సి ఉండగా ఇందులో ఇప్పటికే రూ.6,210 కోట్లు చెల్లించినట్టు చెప్పారు. బ్యాటరీతో నడిచే 600 బస్సులను మహిళా సంఘాలకు ఇచ్చామని తెలిపారు. ఆర్టీసీ సంస్థ భవనాలపై సోలార్ ఉత్పత్తికి ప్రయత్నాలు చేస్తున్నట్టు చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా బస్సులు, బస్టాండ్ల ఆధునికీకరణ జరుగుతోందని తెలిపారు. మధిర బస్టాండ్ పరిసరాల్లో




నీళ్లు నిలబడుతున్నాయని చెప్పగానే రవాణా శాఖ మంత్రి నివేదిక తెప్పించుకొని ఆర్టీసీ బోర్డులో ప్రవేశపెట్టిరూ.10 కోట్లు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు మధిరలో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులు జరుగుతు న్నాయని, ఆర్టీసీ డిపో డ్రయినేజీని వాటికి అనుసంధానం చేయాలని సూచించారు. విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్తు సరఫరా జరుగుతుందని అన్నారు. ఒకవేళ విద్యుత్ అంతరాయం ఏర్పడితే వెనువెంటనే గుర్తించి మరమ్మతులు చేసేందుకు రియల్ టైం ఫీడర్ మేనేజ్‌మెంట్ సిస్టం (టీఆర్ఎఫ్ఎంఎస్), ఫాల్ట్ పాస్ ఏజ్ ఇండికేటర్స్ (ఎఫ్‌పీఐ) ఎంతో ఉపయోగ పడతాయని అన్నారు. ఆధునిక పరి జ్ఞానాన్ని ఎన్‌పీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్.. సంస్థల పరిధిలోని డాష్ బోర్డు ద్వారా రాష్ట్రంలో ఎక్కడ విద్యుత్ సమస్య ఏర్పడినా గుర్తించే అవకాశం ఈ ఆధునిక వ్యవస్థల ద్వారా వీలవుతుందని తెలిపారు.

## మూడో రోజు రూ.1,313 కోట్లు విడుదల

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం వానాకాలానికి ఇస్తున్న రైతు భరోసా పథకం కొనసాగుతున్నది. మూడో రోజు నాలుగు ఎకరాలున్న రైతులకు రూ.1,313.53 కోట్లు విడుదల చేసింది. ఈమేరకు బుధవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. రైతుభరోసా పథకం కింద రైతుల బ్యాంకు ఖాతాల్లోకి పెట్టుబడి సాయం జమ చేసినట్టు తెలిపారు. దీంతో 21.89 లక్షల ఎకరాలున్న 6.33 లక్షల మంది రైతులకు లబ్ది చేకూరుతున్నదని పేర్కొన్నారు. ఇప్పటి వరకు మొత్తం రైతు భరోసా నిధులు రూ.5215.26 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. తద్వారా 58.04 లక్షల మంది రైతులకు సాయం అందించామని పేర్కొన్నారు. రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీమేరకు వరుసగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నట్టు తెలిపారు. ఎకరాలతో సంబంధం లేకుండా సాగు యోగ్యమైన అన్ని భూములకూ ఈ సహాయం అందిస్తామని స్పష్టం చేశారు. రైతుభరోసా విషయంలో బీఆర్ఎస్ నాయకులకు తమ ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదని హెచ్చరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా తొమ్మిది రోజుల్లో రైతుభరోసా సహాయం పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు ఆత్మ విమర్శ చేసుకుని ప్రభుత్వంపై విమర్శలు చేయడం మానుకోవాలని సూచించారు. లేదంటే రైతాంగం ఎప్పటికీ బీఆర్ఎస్ నేతలను క్షమించబోదని హెచ్చరించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక సందర్భంలో మినహా వానాకాలం రైతుబంధు సహాయం ఎప్పుడూ సాగు కాలానికి ముందుగా ఇవ్వలేకపోయిందని గుర్తు చేశారు. ప్రతిసారి ఆలస్యంగా రైతుబంధు నిధులను రైతుల ఖాతాల్లోకి జమ




చేసిందని తెలిపారు. రైతుభరోసా పథకం కింద ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.6వేలకు పెట్టుబడి సహాయం పెంచి రైతులకు అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఇవ్వాల్సిన యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతుబంధు నిధులు ఇవ్వకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం వదిలేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ నిధులను కూడా చెల్లించిందని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే దాదాపు రూ.77,000 కోట్లు రైతు సంక్షేమం కోసం ఖర్చు పెట్టిన ఏకైక రాష్ట్రం తెలంగాణయేనని మంత్రి స్పష్టం చేశారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే గ్రామ గ్రామాన వందలాది నామినేషన్లు వేయిస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. ప్రతీ వార్డులో, పంచాయతీలో వందలాది నామినేషన్లు దాఖలు చేయిస్తామని స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ ఢిల్లీకి వెళ్లడంలో హాఫ్ సెంచరీ పూర్తి చేసిన సీఎం రేవంత్ రెడ్డి ఒక్క సారి కూడా బీసీ బిల్లుపై ప్రధాని నరేంద్ర మోడీతో చర్చించకపోవడం దారుణమని విమర్శించారు. ఢిల్లీకి వెళ్లే ముఖ్యమంత్రుల్లో రేవంత్ రెడ్డికి గిన్నీస్ రికార్డు నమోదు ఖాయమని ఎద్దేవా చేశారు. బీసీ బిల్లు కోసం తెలంగాణ వికసిత్ యాత్ర పేరిట బీజేపీ యాత్ర చేస్తామనడం విడ్డూరంగా ఉందని అన్నారు. బీసీ బిల్లుకు మద్దతివ్వకుండా ఎన్ని యాత్రలు చేసినా బీజేపీని ప్రజలు నమ్మరని తెలిపారు. బీసీ బిల్లు కోసం జులై 17న పెద్ద ఎత్తున రైల్ రోకో కార్యక్రమానికి పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తు చేసిన ఎమ్మెల్సీ కవిత%% జులై 16, 17, 18 తేదీల్లో ప్రయాణాలు పెట్టుకున్నవాళ్లు వాయిదా వేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తాము పిలుపునిచ్చిన రైల్ రోకో కార్యక్రమానికి ఆయా కుల సంఘాల నుంచి పెద్ద ఎత్తున మద్ధతు వస్తోందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సంఘాలు కూడా తెలంగాణ జాగృతి ఉద్యమానికి మద్దతిస్తున్నాయని వివరించారు.

గోదావరి జలాలపై ఆంధ్రప్రదేశ్ మంత్రి నిమ్మల రామానాయుడు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. వృథా అవుతున్న గోదావరి నీటిని పొలాలకు మళ్లించుకోవాలన్నది కేసీఆర్ ఆలోచించి తుపాకులగూడెం వద్ద నుంచి గోదావరి-కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టు చేపట్టాలని వాదించారని అన్నారు. దీని వల్ల తెలంగాణలోని సగం జిల్లాలకు గోదావరి నీరు పుష్కలంగా లభించే అవకాశం ఉంటుందని వివరించారు. పోలవరం నుంచి లింకేజీ ప్రతిపాదనను గతంలోనే జగన్ తెస్తే కేసీఆర్ వ్యతిరేకించారని గుర్తుచేశారు.

తెలంగాణ ప్రాజెక్టులకు చంద్రబాబు వ్యతిరేకం కాదని ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పడం విడ్డూరంగా ఉందని కవిత ఎద్దేవా చేశారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే తెలంగాణ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా



లేఖలు రాశారని ఎండగట్టారు. ఏపీ జలదోపిడీని నివారించే విషయంలో సీఎం రేవంత్ రెడ్డి పేపర్ టైగర్‌గా మిగిలిపోయారని ఎద్దేవా చేశారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టులో భాగంగా 150 టీఎంసీల సామర్థ్యంతో బొల్లాపల్లి వద్ద భారీ రిజర్వాయర్ నిర్మించి నల్లమల అడవిని ముంచేసే కుట్ర చేస్తున్నారని తెలిపారు. దీనిపై తెలంగాణ జాగృతి తరఫున న్యాయపోరాటం చేస్తామని ప్రకటించారు. "ముఖ్యమంత్రి బొల్లాపల్లి రిజర్వాయర్ కట్టకుండా అడ్డుకోండి. అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని సీఎం డిమాండ్ చేయాలి" అని వ్యాఖ్యానించారు.

ఆపరేషన్ కగార్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఆపేయాలని డిమాండ్ చేశారు. ఈ మారణకాండను ప్రభుత్వాలు ఆపి మావోయిస్టులతో చర్చలు జరపాలన్నారు. ఎన్‌కౌంటర్‌లో తెలంగాణకు చెందిన మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవి మరణించడం పట్ల ఎమ్మెల్సీ కవిత సంతాపం తెలియజేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## ఓటర్ ఐడీ కార్డులు..ఎన్నికల సంఘం కీలక ప్రకటన

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ఓటర్లకు ఐడీ కార్డులు త్వరితగతిన అందించేందుకు కొత్త విధానాన్ని ప్రారంభించినట్లు ఎన్నికల సంఘం బుధవారం ప్రకటించింది. ఎన్నికల రిజిస్టర్‌లో దరఖాస్తుకు సంబంధించిన మార్పులు జరిగిన 15 రోజుల్లోపే ఓటర్ ఐడీ కార్డులు ఓటర్లకు చేరేలా ఈ కొత్త విధానం తీసుకొచ్చినట్లు పేర్కొంది. కొత్తగా ఓటర్లుగా నమోదు చేసుకున్న వారితో సహా, ఇప్పటికే ఉన్న ఓటరు వివరాల్లో మార్పులు చేసిన వారికి కూడా 15 రోజుల్లోనే కార్డును డెలివరీ చేస్తామని వెల్లడించింది. ప్రస్తుతం ఓటర్లకు ఓటర్ ఐడీ కార్డులు అందడానికి ఒక నెలకు పైగా సమయం పడుతోందని అధికారులు చెబుతున్నారు. అయితే, ఈ కొత్త వ్యవస్థ ద్వారా ఈ ప్రక్రియను వేగవంతం చేయబోతున్నారు. ఈ కొత్త విధానంలో, ఓటర్ కార్డు తయారవడం నుంచి ఓటరుకు అందే వరకు ప్రతి దశలో పర్యవేక్షించడం కోసం రియల్ టైమ్ ట్రాకింగ్ వ్యవస్థను తీసుకొచ్చినట్లు ఈసీ వివరించింది. ఈ ప్రక్రియను ఎన్నికల రిజిస్ట్రేషన్ ఆఫీసర్ పర్యవేక్షిస్తారు.

## మాజీ ఎంపీటీసీ కుటుంబానికి అండగా ఉంటాం

సిరిసిల్ల :అమృత్ తెలంగాణ: సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ ఎంపీటీసీ కర్మబోయిన కుంటయ్య కుటుంబానికి అండగా ఉంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ హామీ ఇచ్చారు. కుంటయ్య సోమవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకోగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. బుధవారం జిల్లా ఆస్పత్రిలో కుంటయ్య మృతదేహానికి కేటీఆర్ నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఏసీబీ విచారణ జరుగుతున్నప్పుడు తన కోసం హైదరాబాద్ వచ్చి ధైర్యం చెప్పిన కుంటయ్య అదే రోజు రాత్రి ఆత్మహత్యాయత్నం చేసుకోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలిసిన వెంటనే పార్టీ నేతలను పంపి ఆయనను కాపాడుకునేందుకు తమ వంతు ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదన్నారు. కుంటయ్య ఇద్దరు పిల్లల చదువులు, వారి వివాహాలు, ఇతర సమస్యలు పరిష్కరించే బాధ్యత తనదేనని కేటీఆర్ భరోసా కల్పించారు. కుంటయ్య కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా



ఉంటుందని హామీ ఇచ్చారు.

అనంతరం కుంటయ్య మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి స్వగ్రామానికి తరలించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల పహారా మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. కుంటయ్య మృతి పట్ల చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య సంతాపం తెలిపారు. అంత్యక్రియల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లు సెటిల్మెంట్ల అడ్డాలుగా మారాయి: కేటీఆర్

రాష్ట్రంలో పోలీస్ స్టేషన్లు సెటిల్‌మెంట్లకి అడ్డాలుగా మారుతున్నాయని కేటీఆర్ ఆరోపణలు చేశారు. అన్యాయం జరిగిందని ఫిర్యాదు చేయడానికి వచ్చిన వారిపైనే కేసులు నమోదు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పిన విధంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తనకు న్యాయం చేయాలని కుంటయ్య ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకుండా తిరిగి అతనిపైనే కేసు పెట్టడం అమానుషమని అన్నారు.

కుంటయ్యకు జరిగిన అన్యాయంపై న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. భూతగాదాల్లో పోలీసులు జోక్యం చేసుకోవడం మంచిది కాదని సూచించారు. తాము అధికారంలో ఉన్న పదేండ్ల కాలంలో కాంగ్రెస్ నాయకుల మాదిరిగా దిగజారి ప్రవర్తించలేదన్నారు.

## వాసాలమర్రిని కేసీఆర్ గాలికొదిలేశారు

హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: మాజీ మంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా దత్తత తీసుకున్న వాసాలమర్రి గ్రామాన్ని గాలికొదిలేశారని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. ఆ గ్రామంలోని అర్హులైన ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్టు తెలిపారు. వారికి గురువారం మంజూరు పత్రాలను అందజేస్తామని తెలిపారు. కేసీఆర్ చేతిలో మోసపోయిన ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తున్నదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌కు వెళ్లేందుకు వీలుగా రోడ్డు విస్తరణ చేయడంతోపాటు దానికి ఇరువైపులా ఉన్న ఇండ్లను కూల్చివేసి పేదలకు నిలువ నీడ లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండ్లు కోల్పోయి బాధితులు తాత్కాలికంగా గుడిసెలు, టెంట్లు



వేసుకుని నివసిస్తున్నారని తెలిపారు. దీంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం అక్కున చేర్చుకున్నదని గుర్తు చేశారు. సీఎం ఆదేశాల మేరకు వాసాలమర్రి గ్రామంలో సర్వే నిర్వహించి లబ్దిదారులను గుర్తించామని పేర్కొన్నారు. అర్హులైన 205 మందికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్టు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా బండ సోమారం, సూర్యాపేట జిల్లా మోతే మండలంలోని విభలాపూర్‌లో గురువారం ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించనున్నట్టు మంత్రి తెలిపారు.

## హైడ్రాను అడ్డం పెట్టుకుని రేవంత్‌రెడ్డి అండ్ కో బ్లాక్‌మెయిల్

జూబ్లీహిల్స్ :అమృత్ తెలంగాణ: హైడ్రాను అడ్డం పెట్టుకుని రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులంతా బ్లాక్‌మెయిల్ దందాలు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు ఆరోపించారు. రేవంత్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నేతలు అక్రమంగా కట్టుకున్న ఏ ఒక్క ఇంటి జోలికీ వెళ్లడానికి సాహసించని హైడ్రా, పేదల ఇండ్ల మీద మాత్రం ప్రతాపం చూపిస్తోందన్నారు. బుధవారం షేక్‌పేట్‌లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సంస్మరణ సభలో కేటీఆర్ పాల్గొన్నారు. అనంతరం ఇటీవల ఆత్మహత్య చేసుకున్న బీఆర్ఎస్ బోరబండ డివిజన్ మైనార్టీ నాయకుడు మహ్మద్ సర్దార్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఆ తర్వాత కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. యూపీలో బుల్డోజర్ రాజ్యం నడుస్తోందని గొంతుచించుకుంటున్న రాహుల్ గాంధీకి.. తెలంగాణలో రేవంత్‌రెడ్డి చేస్తున్న అరాచకాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. సర్దార్‌ను కాంగ్రెస్‌లోకి రావాలని స్థానిక కార్పొరేటర్ వేధించాడని, అందుకు ఒప్పుకోకపోవడంతో కక్షగట్టి సర్దార్



ఇంటిని, షాప్‌ను కూల్చివేయించాడని ఆరోపించారు. హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారులను అడ్డం పెట్టుకుని వేధించడం వల్లే తమ నేత సర్దార్ ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. తాము మళ్లీ అధికారంలోకి వచ్చాక.. బీఆర్ఎస్ నేతలు, పేదలను వేధిస్తున్న కాంగ్రెస్ నేతల, అధికారుల హిసాబ్ కితాబ్ సెటిల్ చేస్తామని హెచ్చరించారు. ఇలానే వ్యవహరిస్తే.. తాము రేపు మళ్లీ అధికారంలోకి వచ్చాక ఒక్క కాంగ్రెస్, బీజేపీ నేత కూడా రోడ్డు మీద తిరగలేదని హెచ్చరించారు. సర్దార్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని, అవసరమైతే సుప్రీం కోర్టు వరకు వెళ్తామన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ లేని లోటును రానివ్వమన్నారు. బీఆర్ఎస్ క్యాడర్‌కు ఏ కష్టం వచ్చినా ఒక్క ఫోన్ కాల్ చేస్తే మొత్తం పార్టీ అండగా ఉంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు. మీడియా సమావేశంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీలు దాసోజు శ్రావణ్ కుమార్, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్ రెడ్డి, మైనార్టీ నాయకుడు మహమ్మద్ సోయల్, మాజీ మంత్రి మహమ్మద్ అలీ, కార్పొరేటర్‌లు దేదీప్యరావు, రాజ్ కుమార్ పటేల్, డివిజన్ అధ్యక్షుడు విజయ ముదిరాజ్ ఉన్నారు.

# ఇండ్లపై వేలాడుతున్న లెవన్ కివి విద్యుత్ తీగలను తొలగించండి.

**50 కుటుంబాలకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయభ్రాంతులకు గురవుతున్న కుటుంబాలు.... ఈ సమస్యను వెంటనే పరిష్కరించే విధంగా పోరాడుతామని హామీ ఇచ్చిన నేషనల్ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్ కుమార్..**



## పేదల ఇళ్లపై నుండి ప్రమాద భరితంగా 11 కె.వి విద్యుత్ తీగలు, భయాందోళనలో బాధితులు

నిర్మల్ జిల్లా కుబీర్ జూన్ 18 అమృత్ తెలంగాణ 11 కెవి విద్యుత్ వైర్లతో ప్రమాదం పొంచి ఉందని తెలంగాణ విద్యుత్ భవన్ వరంగల్లో సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి,ని గత కొన్ని సంవత్సరాల క్రితం కుబేర్ మండల కేంద్రం న్యూ అబాది కాలనీవాసులు, సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రతినిధి డాక్టర్ సాప పండరి, ఆధ్వర్యంలో వరంగల్ వెళ్లి తమ సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 20 సంవత్సరాలుగా న్యూ అబాది కాలనీలో సుమారు 40 కుటుంబాలకు పైగా పేదలు ఎదుర్కొంటున్న సమస్యను వివరించారు. 2012 లో 7 ఇండ్లు లెవెన్ కె.వి విద్యుత్ వైర్ల ప్రమాదంతో కాలిపోవడం జరిగిందని ఆసమయంలో ధాన్యం రూపంలో, బంగారం రూపంలో, వస్త్ర రూపంలో ఏమాత్రం మిగలకుండా కాలి బూడిద అయ్యాయని, ప్రతి సంవత్సరం వర్ష కాలం వచ్చింది అంటే అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని బతకవలసి వస్తుందని, పేద కుటుంబాల పైన దయుంచి 11 కేవీ విద్యుత్ తీగలను అక్కడి నుండి తొలగించి వారిని రక్షించాలని కోరగా-సానుకూలంగా స్పందించిన నేషనల్ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్ కుమార్, తప్పకుండా ఈ విషయంపై చర్యలు తీసుకుందామని హామీ ఇచ్చారు

# తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం ఆర్టిఐ సెల్ చైర్మన్ గా డాక్టర్ సప పండరి......,

**ఆయనను అభినందిస్తున్న జిల్లా మండల ప్రజలు......**
**ఆయన చేస్తున్న సేవలు అభినందనీయం**




పదవి బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సఫా పండరి,ని సన్మానిస్తున్న దృశ్యం

హైదరాబాద్ జూన్ 18 అమృత్ తెలంగాణ, బుధవారం రోజు సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశము హైదరాబాదులోని రీగల్ హెూటల్ నందు నిర్వహించిన సందర్భంగా సామాజిక సేవలో బాల కార్మికులను గుర్తించడం, అంటరానితనం నిషేధించడం, బాల్యవివాహాలను అరికట్టడం, యువతకు ఓటు హక్కు ప్రాధాన్యత గురించి అవగాహన కల్పించడం, గ్రామంలోని మురికి కాలువల శుభ్రత గురించి ప్రశ్నించడం-సమాధానం రాబట్టడం, మత్తు పానీయాలపై యువత చిత్తు అంటూ యువతకు అవగాహన సదస్సులు నిర్వహించి బహుమతులు అందించడం వంటి సామాజిక సేవ చేస్తున్న"""""డాక్టర్ సాప పండగ"""""తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం ఆర్టీఐ సెల్ చైర్మన్ గా"""""""పదోన్నతి కల్పించి శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా నేషనల్ జనరల్ సెక్రెటరీ గంప హనుమా గౌడ్ నేషనల్ స్థాయి, రాష్ట్రస్థాయి ప్రతినిధులు పలువురు పాల్గొని సాప పండరి కి అభినందించారు. ఈ సమావేశంలో భాగంగా సాప పండరి మాట్లాడుతూ నాపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను బాధ్యతాయుతంగా నిర్వహిస్తానని హామీ ఇచ్చారు

# పరిసరాల పరిశుభ్రత పాటించాలి

నవాబు పేట :అమృత్ తెలంగాణ: పరిసరాల పరిశుభ్రత పాటించాలి అని ఎంపీడీవో జయరాం నాయక్ అన్నారు బుధవారం మండల పరిధిలోని ఇమ్మనగండ్ల గ్రామంలో పలు వీధులలో పెరిగిన పిచ్చి మొక్కలను డ్రైనేజీ లో పేరుకుపోయిన మురికి చెత్తను పిచ్చిమొక్కలు గ్రామపంచాయతీ కార్మికుల ద్వారా తొలగించి పరిశుభ్రత పాటించాలి అని వీధులలో తిరిగి అవగాహన కల్పించారు.సీజనల్ వ్యాధులు రాకుండా ఉండాలంటే ప్రజలు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న చెత్త లేకుండా గుంతలలో నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలి అని సూచించారు.దోమలు ఈగల వల్ల పలు రకాల వ్యాధులు వస్తాయి అని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ భద్రు నాయక్ పంచాయతి కార్యదర్శి సుష్మా నాయకులు హమీద్ మహెక్ పంచాయతి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవా భవన్ ను సందర్శించిన శివచరణ్ రెడ్డి



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజాసేవా భవన్ ను యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డి సందర్శించారు. బుధవారం యూత్ కాంగ్రెస్ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన అయన కార్యక్రమం అనంతరం ప్రజా సేవా భవన్ కు వచ్చారు. ఈ సందర్బంగా కంది శ్రీనివాస రెడ్డి కాంగ్రెస్ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

# రైతులకు బాసటగా రైతు భరోసా



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : వానాకాలం ప్రారంభానికి ముందే రూ.112.8 6 కోట్ల నిధుల జమ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్. వానాకాలం సీజన్‌కు ముందే రైతుల ఖాతాల్లోకి నిధులు జమ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం, రైతులకు బాసటగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. వ్యవసాయాన్ని పండుగలా మార్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. వానాకాలం-2025 సీజన్‌కు సంబంధించి నిర్మల్ జిల్లాలో మొత్తం రైతులు 1,86,400 గాను

మంగళవారం నాటికీ DBT ద్వారా విజయవంతంగా 1,33,135 మంది రైతులకు రూ.112.86 కోట్లు నిధులు నేరుగా రైతుల ఖాతాలో చేరినట్లు వివరించారు. రైతుల బ్యాంకు ఖాతాల వివరాలు రైతు భరోసా పోర్టల్‌లో నమోదు చేసినట్లు, మిగిలిన రైతుల ఖాతాల్లోనూ త్వరలోనే నిధులు జమ కాబోతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్ని ఎకరాలున్నా అన్ని ఎకరాలకు తగిన పెట్టుబడి సాయం అందేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టినట్లు వివరించారు. పెట్టుబడి భారం తగ్గించడమే కాకుండా, వ్యవసాయ ఉత్పాదకత పెంపుకు ఈ పథకం ప్రభావవంతంగా ఉపయోగపడుతోందని చెప్పారు. వానాకాలం సాగు ప్రారంభానికి ముందే నిధులు విడుదల కావడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు.

# చిన్న ఏడ్గీ లో అంగన్వాడి ఆధ్వర్యంలో ఈసిసిఈ కార్యక్రమం.



జుక్కల్ : అమృత్ తెలంగాణ: ఈ రోజు జుక్కల్ మండల లోని చిన్న ఎడ్గి గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో ప్రతి నెల నిర్వహించే. ఈ సి సి ఈ. డే. కార్యక్రమము టీచర్ చంద్రకళ ఆధ్వర్యంలో బుధవారం నాడు నిర్వహించారు . ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్స్ మరియు. గర్భిణి. బాలింత. చిన్న పిల్లల కు. తమ అంగన్వాడి కేంద్రంలో ఉన్న బొమ్మలతో లబ్ధిదారులకు , పిల్లలకు ఉల్లాసం , ఆనందం కలిగించే బొమ్మల ఆటలు ఆడించే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అంతకు ముందు గ్రామంలో అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ చంద్రకళ తో పాటు గర్భిణీ మహిళలు , బాలింతలు మరియు. పిల్లలు. లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.


# అంగన్వాడీ ఆధ్వర్యంలో అమ్మ మాట - అంగన్వాడి బాట



జుక్కల్ :అమృత్ తెలంగాణ: మండలంలోని పెద్దగుల్లా గ్రామంలో అమ్మ మాట- అంగన్వాడి బాట కార్యక్రమములో భాగంగా ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ డే సందర్భంగా పిల్లలకు కేంద్రం టీచర్ లతా తాయి అక్షరాభ్యాసం చేయించారు . ఈ సందర్భంగా రెండున్నర ఏండ పిల్లలకు పలుకలు అందజేస్తూ అక్షరాభ్యాసం చేయించారు .

# అక్రమణాలను తొలగించాలి

**కాలువలపై యదేచ్ఛగా అక్రమణాలు... వాటిని వెంటనే తొలగించాలని ఎంపీడీవో కు వినతి పత్రం అందజేసిన ఆర్టిఐ ప్రతినిధి జాదవ్ మోతిలాల్ పటేల్...**



ఎంపీడీవోకు ఇచ్చిన ఫిర్యాదు పత్రంతోఆర్టిఐ ప్రతినిధి జాదవ్ మోతీలాల్ పటేల్,

నిర్మల్ జిల్లా బూరుగుపల్లి కే జూన్ 18 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండలం బూరుగుపల్లి (కె) లో రోడ్లు, కాలువల అక్రమణపై ఫిర్యాదు: పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యంపై ఆరోపణలు బూరుగుపల్లి కె గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, మురికి కాలువల ఆక్రమణల సమస్యలపై అదే గ్రామానికి చెందిన జాదవ్ మోతీలాల్ పటేల్, బుధవారం మండల పంచాయతీ అధికారి పుష్పలత,కు ఫిర్యాదు చేశారు. తన దరఖాస్తులో, జాదవ్ మోతిలాల్ పటేల్, మాట్లాడుతూ గ్రామస్థులు అక్రమంగా రోడ్లపై కంచెలు వేసి, ఇళ్లను నిర్మించారని, దీనివల్ల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. అంతేకాకుండా, మురికి కాలువలను పూర్తిగా తొలగించి ఇళ్లు కట్టడం వల్ల వర్షపు నీరు నిలిచిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రభుత్వ రోడ్లను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారని, చేతిపంపులు, సబ్ మెర్సిబుల్ పంపులను మూసివేయించారని, దీనివల్ల తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన తెలిపారు. ఈ ఆక్రమణలపై తక్షణమే చర్యలు తీసుకొని, పర్మినెంట్ కట్టడాలు, రోడ్లు, కాలువలను తొలగించి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జాదవ్ మోతిలాల్ పటేల్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను, ఉమ్మడి ఆస్తులను పరిరక్షించాలని ఆయన కోరారు. మండలంలో ప్రభుత్వ

స్థలాల్లో నాలా పర్మిషన్ లేకుండా ఇళ్లు నిర్మిస్తున్నా, పంచాయతీ కార్యదర్శులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ ఫిర్యాదుపై మండల పంచాయతీ అధికారి తగిన విచారణ జరిపి చర్యలు తీసుకుంటారని గ్రామ ప్రజలు ఆశిస్తున్నారు.

# ప్రజాసేవలో విశిష్టత - వైద్యులకు "బెస్ట్ డాక్టర్" అవార్డు ఆనందిత ఫౌండేషన్ ఘన సత్కారం....

నిర్మల్ జిల్లా బైంసా జూన్ 18 అమృత తెలంగాణ ముధోల్ నియోజకవర్గం ప్రజలకు వైద్య సేవలను సేవాధర్మంగా భావిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో నిరంతరం ప్రజలకు ఆరోగ్య పరిరక్షణ అందిస్తున్న డా. ఉప్పరి కాశినాథ్ (సూపరింటెండెంట్, ఏరియా హాస్పిటల్, భైన్సా), డా. అనిల్ కుమార్ జాధవ్, (పెడియాట్రిషియన్) లు ఇటీవల సుమన్ టీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో "బెస్ట్ డాక్టర్ అవార్డు" అందుకున్నారు. వీరి అసాధారణ సేవలను గౌరవిస్తూ, ఆనందిత ఫౌండేషన్ తరఫున హైదరాబాదులో ప్రత్యేక సత్కార కార్యక్రమం నిర్వహించబడింది. ఫౌండేషన్ చైర్మన్ శ్రీ వాడేకర్ లక్ష్మణ్, ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. వైద్యులకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ అవార్డులు గర్వకారణమే కాని, అవి మరింత బాధ్యతను గుర్తు చేస్తాయన్నారు. తమ లక్ష్యం గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలను అందించడమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్ దుగ్గే, శ్రీనివాస్ గడ్డం తదితరులు పాల్గొని వైద్యులకు అభినందనలు తెలియజేశారు.



సుమన్ టీవీ అవార్డులు పొందిన వైద్యులను సన్మానిస్తున్న ఆనందిత ఫౌండేషన్ సభ్యులు

# పంట రుణాలు సకాలంలో మంజూరు చేయాలి : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.




అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి- జిల్లాలో వ్యవసాయ, మత్స్య, గ్రామీణ, పట్టణ ఉపాధి రంగాల అభివృద్ధికి బ్యాంకులు పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎల్‌డీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి డిసిసీ, డీఎల్ఆర్‌సి సమావేశంలో శాసన సభ్యులు, బ్యాంకుల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు పంట రుణాలను లక్ష్యంగా తీసుకొని సకాలంలో మంజూరు చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. పంట భీమా అమలుపై సానుకూల దృష్టితో ముందుకు సాగాలని చెప్పారు. పీఎం విశ్వకర్మ, పీఎం ఈజీపి, డెయిరీ యూనిట్లు, మత్స్యకారుల రుణాలు, ఎస్‌హెచ్‌జీ మహిళల వ్యక్తిగత, సంఘాల రుణాలు, ముద్ర, రాజీవ్ యువ కిరణల వంటి పథకాల అమలులో బ్యాంకులు సానుకూలంగా వ్యవహరించాలన్నారు. పట్టణాల్లో మెప్మా ద్వారా, గ్రామీణ ప్రాంతాల్లో గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలుగా కిరాణ దుకాణాలు, బ్యూటీ పార్లర్, పెయింటింగ్ వంటి రంగాల కోసం అవసరమైన రుణాలను సులభంగా మంజూరు చేయాలని తెలిపారు. మహిళా శక్తి క్యాంటిన్ వంటి పథకాల్లో బ్యాంకులు భాగస్వామ్యం కావాలన్నారు. పంట రుణాల వడ్డీలు చెల్లించి రైతులు రినివల్ చేయుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్, శాసన సభ్యులు కలిసి వార్షిక ఋణ ప్రణాళిక %- 2025-%26ను విడుదల చేశారు. జిల్లాలో వ్యవసాయ రంగానికి రూ.4,70,674.3 లక్షలు , విద్య, గృహ, ఆరోగ్య రంగాలకు రూ.1,13,257.99 లక్షలు రుణంగా పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించామని కలెక్టర్ తెలిపారు. పశుపోషణ, కోల్డ్ స్టోరేజీ, పంటల నిల్వ వంటి వ్యవసాయ ఆధారిత రంగాలకు, మహిళా సంఘాలకు ప్రత్యేక రుణ ప్రోత్సాహకాలు, ఎంఎస్ఎంఈలకు నిధుల సమకూర్పుతో పాటు స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వనున్నట్లు వివరించారు. డిజిటల్ లావాదేవీల పెంపు కోసం ఆటోమేషన్ వంటి చర్యలకు బ్యాంకులు సహకరించాలన్నారు. ఎస్ఎల్బీసీ, డిఎల్సీసీ, బిఎల్బీసీ స్థాయిల్లో సమీక్షలు జరిపి బ్యాంకులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం బ్యాంకుల వారీగా లక్ష్యం, పురోగతి తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో నిర్మల్, ముధోల్, ఖానాపూర్ శాసన సభ్యులు మహేశ్వర్ రెడ్డి, రామారావ్ పటేల్, వెడ్మ బొజ్జు పటేల్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఎల్‌డీఎం రాంగోపాల్, బ్యాంకుల ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రూ.80వేలు లంచం తీసుకుంటూ..

మహబూబాబాద్ : అమృత్ తెలంగాణ: రూ.80వేలు లంచం తీసుకుంటూ మహబూబాబాద్ విద్యుత్ శాఖ ఎస్‌ఈ నరేశ్ బుధవారం ఏసీబీకి పట్టుబడిన ఘటన మహబూబాబాద్‌లో జరిగింది. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్‌కు చెందిన ఎన్‌పీడీసీఎల్ కాంట్రాక్టర్.. మహబూబాబాద్, కురవి మండలాల్లో ఎన్‌పీడీసీఎల్ సంస్థలో మరమ్మత్తులు చేయడానికి కాంట్రాక్టు కుదుర్చుకున్నాడు. కాగా అతనికి రూ.20 లక్షలు చేసే పనులకు మాత్రమే లైసెన్స్ ఉన్నది. కానీ, అతను రూ.20 లక్షలకుపైగా పనులు చేశారు. దాంతో బిల్లులు పొందడం కోసం లైసెన్స్‌ను రూ.20 లక్షలకు పైగా ఎక్స్‌టెన్షన్ చేయడం కోసం ఫైల్ పెట్టుకున్నాడు. ఈ ఫైల్‌ని ఏఈ, ఏడీఈ, డీఈ అప్రూవల్ చేశారు. కానీ ఎస్‌ఈ వద్ద ఫైల్ పెండింగ్‌లో ఉ



ంది. ఆ ఫైల్ క్లియర్ చేయడానికి ఎస్‌ఈ నరేశ్ కాంట్రాక్టర్‌ను రూ.లక్ష లంచం అడిగారు. తాను అంత ఇచ్చుకోలేనని ఎన్నిసార్లు బతిమాలినా వినిపించుకోలేదు. దాంతో ఈనెల 14వ తేదీన రూ.20వేలు చెల్లించినప్పటికీ ఇంకా రూ.80,000 ఇవ్వాలని ఒత్తిడి చేశారు.

# భారీ వర్షాలు, వరదలపై అప్రమత్తంగా ఉండాలి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్





అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి జిల్లాలో వర్షాలు, వరదల వల్ల ప్రజలు ప్రాణాలు, ఆస్తులు కోల్పోకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆమె ఫ్లడ్ మాన్యువల్ పై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విపత్తుల నిర్వహణ కేవలం స్పందనకే పరిమితం కాకుండా, ప్రమాద నివారణ, తీవ్రత తగ్గింపు, పునరావాసం, పునర్నిర్మాణం దశల్లో ముందస్తుగా ప్రణాళికలు ఉండాలని సూచించారు. వర్షాకాలానికి ముందు నదులు, వాగులు, కుంటలలో నీటి ప్రవాహ మార్గాలను శుభ్రం చేయాలని, పట్టణాల్లో డ్రైనేజీ వ్యవస్థను పర్యవేక్షించాలని, పాడైన రహదారులను తక్షణమే మరమ్మతు చేయాలని సూచించారు. రిజర్వాయర్ల గేట్ల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కడెం, స్వర్ణ, గడ్డెన్న ప్రాజెక్టులు, గోదావరి పరివాహక గ్రామాల్లో నివసించే ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలనీ సూచించారు. నీటిపారుదల శాఖ అధికారులు ప్రాజెక్టుల నీటిమట్టాలను నిరంతరం గమనిస్తూ దిగువ గ్రామాలకు సమాచారం అందించాలని, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలనీ చెప్పారు. అలానే మత్స్యకారులు, విద్యుత్ శాఖ, మీడియాకు సమగ్ర సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదకర ప్రాంతాల్లో ఉన్న బ్రిడ్జిలు, రహదారులను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ వైద్యులు, సిబ్బంది స్థానికంగా అందుబాటులో ఉండాలని అన్నారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పశువులను భారీ వర్షాల సమయంలో మేతకు తీసుకెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ, పోలీస్, ఫైర్, విద్యుత్ శాఖలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ముందస్తుగా హెచ్చరికలు ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం మండలాల వారీగా వరద ప్రభావిత ప్రాంతాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఏఎస్పీ ఉపేంద్ర రెడ్డి, ఆర్డీఓ రత్నాకళ్యాణి, రెవెన్యూ, విద్యుత్, ఫైర్, ఇంజనీరింగ్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలకు ఎంపికైన విద్యార్థినికి సన్మానించి వీడ్కోలు పలికిన హెచ్ఎం

జుక్కల్ :అమృత్ తెలంగాణ: మండలంలోని బిజ్జల్ వాడి గ్రామ ఎంపీపీ ఎస్ పాఠశాల నాలుగవ తరగతి విద్యార్థినికి గ్రామ పెద్దలతో కలిసి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈ . రవీకుమార్ ఆధ్వర్యంలో చిన్నారికి వీడ్కోలు సభ లో ఘనంగా సన్మానించారు . ఈ సందర్భంగా హెచ్ఎం రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులే అత్యధికంగా విద్యను అభ్యసిస్తున్నారు అని అన్నారు . మారుమూల మహారాష్ట్ర సరిహద్దు గ్రామం అయినా బిజ్జల్ వాడి లో అత్యధికంగా మరాఠీ , కన్నడ మాట్లాడే వారు ఎక్కువ ఉండడంతో ఇక్కడి పిల్లలకు తెలుగు భాష పై మక్కువ తక్కువ ఉండడం గమనించామని అన్నారు. అటువంటి వారిని గుర్తించిన విద్యార్థులను తెలుగులోనే మాట్లాడేందుకు విద్యార్థులకు నిత్యం తెలుగు భాష బోధన చేస్తున్నామని తెలిపారు. ఇప్పుడిప్పుడే తెలుగు భాష పై గ్రామంలో మక్కువ పెంచుకొని కొంతమంది మాట్లాడడం జరుగుతుందని ఇది మంచి మార్పు అని అన్నారు. అదేవిధంగా గ్రామంలో



బడిబాట కార్యక్రమం నిర్వహించినామని , కొత్తగా విద్యార్థులను పాఠశాలలో అడ్మిషన్ చేస్తున్నామని తెలిపారు . ప్రస్తుతం పరిస్థితులలో ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలే మేలు అని గ్రామంలో ర్యాలీగా తిరుగుతూ గ్రామస్తులకు తెలిపామని తెలిపారు . ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే బోధించబడుతున్నదని సూచించారు . తల్లిదండ్రులు ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపవద్దని , ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే పంపించి వారి పిల్లల భవిష్యత్తును మార్గదర్శకంగా ఉండే విధంగా విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మరియు విద్యార్థిని , విద్యార్థులు వారి కుటుంబ సభ్యులు , గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు .

# మహిళ భూమిని నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా ప్రయత్నం చేసిన ఆరుగురి అరెస్ట్ - అదిలాబాద్ రూరల్ సీఐ కె ఫణిధర్

**నకిలీ పత్రాల సృష్టించి మహిళను బెదిరించిన నిందితులు.**

**15 మందిపై ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు, ఆరుగురు అరెస్ట్ రిమాండ్.**

**భూ ఆక్రమణలకు ప్రయత్నించే వారిని ఉక్కు పాదంతో అణిచివేస్తాం.**

**బాధితులను బెదిరించి భూములను కబ్జా చేసే ముఠా అరెస్ట్, రిమాండ్.**

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : 1979 సంవత్సరంలో గడ్డం యాదవ రావు అనే వ్యక్తికి సంబంధించిన అనుకుంట గ్రామం లోని సర్వే నెంబర్ 7/1 లోని ఐదు ఎకరాల 10 గుంటల స్థలాన్ని కళావతి బాయి అనే మహిళ కొనుగోలు చేస్తుంది, తదుపరి కళావతి బాయి 2020 సంవత్సరంలో తన వదిన అయినా గైదాని లతా వామన్ రావుకు అమ్ముతుంది. ఈ స్థలాన్ని ఎలాగైనా కొట్టేయాలని దురుద్దేశంతో ఆదిలాబాద్ లోని ముగ్గురు వ్యక్తులు వారి బినామీల సహకారంతో నకిలీ పత్రాలు సృష్టించి యాదవ రావు వారసుల ద్వారా అట్టి భూమిని కొనుగోలు చేసినట్టు సేల్ అగ్రిమెంట్ దస్తా వేజులు తయారు చేసి బాధితురాలని బెదిరించి స్థలం నుండి వెళ్లగొట్టాలని ప్రయత్నం చేశారు. ఈ సందర్భంలో బాధితురాలు గైదాని లతా వామన్ రావు ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ నందు తన భూమి నందు అక్రమంగా పత్రాలు సృష్టించి తనను వేధిస్తున్నాడని భూమి నుండి వెళ్లగొట్టాలని ప్రయత్నం చేస్తున్నాడని ఫిర్యాదు మేరకు ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ నందు క్రైమ్ నెంబర్ 195/25తో కేసు నమోదు చేసి విచారించడం జరుగుతుందని ఆదిలాబాద్ రూరల్ సీఐ కె ఫణిదర్ తెలిపారు.

కేసు నమోదు అయి అరెస్టు అయిన వారి వివరాలు

1) సయ్యద్ సాజిద్ ఏ సాజిజుద్దీన్ , మసూద్ నగర్ అదిలాబాద్. (అరెస్టు)

2) వకులభరణం ఆదినాథ్, శాంతినగర్ ఆదిలాబాద్. (అరెస్టు)

3) మహమ్మద్ ముజాహిద్ ఏ పత్తి ముజ్జు (పరారీ)

ఈ ముగ్గురు ప్రధాన నిందితులు

వీరికి బినామీలుగా వ్యవహరించిన మిగిలిన ఆరుగురు

4) చింతకుంట్ల సురేష్, బృందావన్ కాలనీ ఆదిలాబాద్. (అరెస్టు)

5) సోంజోకి మోహన్ లాల్, కిషన్, వయస్సు: 52 సంవత్సరాలు, కులం: మహర్, ప్రాంతం: శివఘాట్ గ్రామం వ్యవసాయం (అరెస్టు)

6: షేక్ వహీద్, యూసుఫ్, వయస్సు: 42 సంవత్సరాలు, కులం: ముస్లిం,శాంతినగర్, ఆదిలాబాద్ (అరెస్ట్)

7: సయ్యద్ యాహియా, s/o సయ్యద్ ఇబ్రహీం, వయస్సు: 36 సంవత్సరాలు. కులం: ముస్లిం. వృత్తి: వ్యాపారం,

r/o బొక్కల్‌గూడ, ఆదిలాబాద్. (అరెస్టు)

A-8: షేక్ అబిద్ షేక్ నూర్, షేక్ నూర్ చంద్ (పరారీ)

అదేవిధంగా మొదటిగా అమ్మిన వ్యక్తి గడ్డం యాదవ్ వారసుల సహకరించిన కారణంగా వారి వారసులైన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు విచారణ జరుపుకున్నట్లు తెలిపారు.

వారి వివరాలు




ఏ-9: పార్వతీబాయి గడ్డంవర్ (పరారీలో)

ఏ-10: గడ్డం ప్రశాంత్ (పరారీలో)

ఏ-11: తనూజ నందకుమార్ దేశ్ పాండే (పరారీలో)

ఏ-12: శోభా వినాయక్ కులకర్ణి (పరారీలో)

ఎ-13బీ గడ్డంవర్ రామారావు (పరారీలో)

ఏ-14: లలితా సుభాష్ లాంబే (పరారీలో)

ఏ-15: దేశ్ పాండే సునీత (పరారీలో)

# ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ



భిక్కనూర్ :అమృత్ తెలంగాణ: భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని హరిజనవాడ కాలనీలో బుధవారం పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్ల పథకం, ప్రభుత్వ పథకాలు అందుతాయని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్,

పట్టణ అధ్యక్షుడు దయాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు లింబాద్రి, యూత్ నాయకులు కిరణ్, నాగరాజు, పంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

# స్కూల్ భవన నిర్మాణం శంకుస్థాపన శిలాఫలకం ధ్వంసం

మద్నూర్ : అమృత్ తెలంగాణ: జుక్కల్ నియోజకవర్గం విద్య హబ్బుగా మార్చేందుకు ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ప్రభుత్వం వద్ద పట్టుబట్టి నియోజకవర్గంలోని మద్నూర్ మండల కేంద్రంలోని సోమలింగాల గుట్ట ప్రాంతంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేయించి భవన నిర్మాణం కోసం అప్పటి జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా 305 కోట్ల నిధులతో17/12/2024 రోజున శంకుస్థాపన చేయడం జరిగింది శంకుస్థాపన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు విద్యాభివృద్ధి కోసం ఎమ్మెల్యే జుక్కల్ నియోజకవర్గాన్ని విద్య హబ్బుగా మార్చాలని ఉద్దేశంతో ఈ రెసిడెన్షియల్ పాఠశాలను మద్నూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేయడానికి జిల్లా ఇన్చార్జి




మంత్రి ద్వారా శంకుస్థాపన జరిపించగా ఆ శంకుస్థాపన శిలాఫలకం ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు భారీ నిధులతో పాఠశాల భవనం నిర్మించడానికి షీలా ఫలకం వేసి శంకుస్థాపన చేస్తే దానిని పగలగొట్టడం ఎమ్మెల్యే చేసే అభివృద్ధి పనులను చూడలేకనే కొందరు ఇలా చేసి ఉంటారని అనుమానం వ్యక్తపరుస్తున్నారు

# భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే భూభారతి

భువనగిరి :అమృత్ తెలంగాణ: భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు అందరు సద్వినియోగం చేసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం రోజు యాదగిరి గుట్ట మున్సిపల్ కార్యాలయ ఆవరణలో యాదగిరిపల్లి గ్రామం భూ భారతి రెవిన్యూ సదస్సు లో పాల్గొని భూభారతి రెవెన్యూ సదస్సు సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. భూ భారతి రెవిన్యూ సదస్సు లో రైతులతో మాట్లాడి వారి సమస్యలు కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు.జూన్, 20 తేది వరకుఅన్ని గ్రామాల లో రెవిన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి నిర్వహిస్తున్న నూతన భూభారతి రెవెన్యూ చట్టం 2025, రెవెన్యూ గ్రామసభల పై రైతులు ప్రత్యేకంగా అవగాహన పెంచుకొని వారి సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈ సదస్సులను పక్కాగా వినియోగించుకోవాలన్నారు, అందుకనుగుణంగా దరఖాస్తులను పూర్తి చేసేందుకు హెల్ప్ డెస్క్ లను, రిజిస్టర్ల ను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం దరఖాస్తులను స్వీకరిస్తున్నామని రైతులకు తెలియజేశారు.భూ భారతి చట్టంలో రైతుల భూముల సమస్యలు తప్పనిసరిగా పరిష్కారం అవుతాయని రైతులకు తెలియజేశారు. దరఖాస్తు చేయడం కోసం వచ్చే




వారికి హెల్ప్ డెస్క్ లు పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని రైతులకు తెలియజేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమం లో రెవిన్యూ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

# నవోదయలో ఏం జరుగుతోంది..?




నిజాంసాగర్ : అమృత్ తెలంగాణ: కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ లోని జవహర్ నవోదయ విద్యాలయంలో గత అకాడమీకి ఇయర్ పలువురు విద్యార్థులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారు నలుగురు ఉపాధ్యాయులపై ప్రోక్సో కింద కేసు నమోదు రిమాండ్కు వెళ్లి వచ్చారు. ఆ సమయంలో విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ గా ఉన్న మను యోహాన్ ఘటనకు సంబంధించి సమాచారం ఇవ్వకపోవడం పట్ల ఆయనపై సైతం కేసు నమోదు అయ్యింది.

ఈ నేపథ్యంలో ఆయనను అక్కడి నుంచి బదిలీ చేశారు. కాగా తాజాగా 20 25 విద్యా సంవత్సరం ప్రారంభం కాగా మళ్లీ ఆయనకే ఇంచార్జి ప్రిన్సిపల్ గా బాధ్యతలు ఇవ్వడం పట్ల విద్యార్థి సంఘాల నాయకులు పిల్లల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తికి మళ్లీ అదే స్థానంలో బాధ్యతలు ఇవ్వడం సరికాదని మండిపడుతున్నారు. అయితే బుధవారం ముగ్గురు అధికారులతో కూడిన బృందం విచారణకు వచ్చినట్టు సమాచారం. ఏదో విషయంలో ఇంటర్నల్ గా ఎంక్వయిరీ చేస్తున్నట్టు తెలిసింది. ఈ విషయమై ఆరా తీసెందుకు విలేకరులు వెళ్లగా వారిని రానీయకుండా అడ్డుకొని గేటుకు తాళం వేశారు. లోపలికి అనుమతి లేదంటు అడ్డుకోవడంపై సర్వత్ర అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అసలు నవోదయలో ఏం జరుగుతుంది అన్న చర్చ మొదలైంది.

# అధికారులు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి

తొగుట :అమృత్ తెలంగాణ: అధికారులు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురా వాలని ఆత్మకమిటీ ఛైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం తొగుట రైతు వేదికలో దుబ్బాక డివిజన్ ఆత్మ కమిటీ ఛైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, డైరెక్టర్ లకు మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానం చేశారు. అనంతరం ఆత్మ కమిటీ ఛైర్మెన్ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ అధికారులు అదు నాతన పద్ధతుల ద్వారా వ్యవసాయం గురించి అవగాహ న కల్పించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో రైతులు వ్యవసాయం పై మంచి పట్టు సాధించే విధంగా కృషి చేయాలని సూచించారు. ఆత్మ కమిటీ డైరెక్టర్లు రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమమం లో వ్యవసాయ అధికారి మోహన్, విస్తరణ అధి కారులు రాజేష్, సాయి కుమార్, నాగార్జున్, దేవేందర్, ఆత్మ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# బనకచర్లపై గరంగరం

హైదరాబాద్ .అమృత్ తెలంగాణ: గోదావరి నదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్ట్‌పై జరిగిన అఖిలపక్ష ఎంపీల సమావేశం వాడివేడిగా జరిగింది. ముఖ్య మంత్రి ఏ రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా బనకచర్ల వల్ల రాష్ట్రానికి ఏర్పడే నష్టాన్ని వివ రించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లా డారు. మాజీ సీఎం కే చంద్రశేఖరరావు హయాం లోనే ఈ ప్రాజెక్ట్‌కు అంకురార్పణ జరిగిందన్నారు. ఈ వివాదానికి బీఆర్ఎస్‌పార్టీనే కారణమంటూ ఫైర్ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడికి కేంద్రంలో పలుకుబడి ఉన్నా, దాన్ని ఎలా అడ్డుకోవాలో తమకు తెలుసని వ్యాఖ్యా నించారు. సీఎం వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్రమ ప్రాజెక్ట్‌పై మాట్లాడతామని చెప్పి, రాజకీయ ప్రసంగం చేయడం ఏంటని ప్రశ్నిం చారు. ప్రాజెక్ట్ నిర్మాణం, ప్రభుత్వం చేపట్టాలనుకుంటున్న చర్యల వరకే పరిమితం అయితే బాగుం టుందని సూచించారు. తమ నాయకుడు కేసీఆర్ పై ఆరోపణలు, నిందలు వేసి నందుకు నిరసనగా సమావేశం నుంచి వాకౌట్ చేస్తు న్నట్టు ప్రకటించి బయటకు వెళ్లిపోయారు. బీజేపీ తరఫున ఆపార్టీ ఎంపీలు డీకే ఆరుణ, రఘునందన రావు హాజర య్యారు. రాష్ట్రానికి నష్టం జరిగితే ఊరుకోబోమనీ, సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. గోదావరిపై పెండింగ్ ప్రాజెక్టుల్ని సకాలంలో ఎందుకు పూర్తిచేయలేకపోయారంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మీటింగ్‌కు కాం గ్రెస్ ఎంపీలతో పాటు ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కూడా హాజరయ్యారు. ఈ సమావేశానికి కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజరు లను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించింది. అయితే వారిరువురూ గైర్హాజరయ్యారు.

కేసీఆరే కారణం : సీఎం

సమావేశం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి సచివాల యంలో విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలోనే గోదావరి –బనకచర్లకు అంకురార్పణ జరిగిందన్నారు. 2019 అక్టోబరులో కేసీఆర్, జగన్ కలిసి గోదావరి జలాలను రాయల సీమకు తరలించడంపై చర్చించు కున్నారని తెలి పారు. రాయలసీమకు గోదావరి జలాల తరలింపులో సహకరిస్తామని కేసీఆర్ అన్నట్టు వారి సొంత పత్రిక లో రాశారని గుర్తుచేశారు. రాజకీయాలు ఎలా ఉన్నా రైతుల విషయంలో రాజీపడేది లేదన్నారు. బనకచర్ల వ్యవహారంపై ఏలా ముందుకెళ్లాలనే అంశంపై విపక్షాలతో చర్చించామన్నారు. తెలంగాణకు గోదా వరి, కృష్ణా నదులే జీవనాధారమనీ, రాష్ట్ర ప్రభుత్వా నికి రైతుల ప్రయోజనాలే ముఖ్యమని చెప్పారు. 2016, సెప్టెంబరు 21న కేంద్ర ప్రభుత్వం అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించిందన్నారు. ప్రతి సంవత్సరం 3000 టీఎంసీల నీరు వృధాగా గోదావరి నీరు సముద్రంలో కలుస్తున్నదని అపెక్స్ కౌన్సిల్ భేటీలో కేసీఆర్ అన్నారని గుర్తు చేశారు. మూడు వేల టీఎంసీలు వృధాగా పోతున్నాయని మొదట మాట్లాడింది ఆయనేనని చెప్పారు. అపెక్స్ కౌన్సిల్ భేటీలో ఎవరు ఏం మాట్లాడారో అంతా రికార్డు రూపంలో ఉందనీ, రాయలసీమకు గోదావరి జలాల తరలింపుపై చర్చించుకున్నామని అప్పట్లో తెలంగాణ, ఏపీ మంత్రులు మీడియాకు చెప్పారని వివరిం చారు. గోదావరి–బనకచర్లపై అవసరమైతే సుప్రీంకోర్టుకైనా వెళ్లాలని భావిస్తున్నామని తెలిపారు. నీటి ఒప్పందాలపై నిపుణులైన న్యాయవాదులను నియమించు కుంటామనీ, రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకు నేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తామన్నారు. గోదావరి బనకచర్లను వ్యతిరేకిస్తూ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని నిర్ణయించామన్నారు. అన్ని పార్టీలను కలుపుకుని పోరాడుతామని తెలిపారు.తెలంగాణకు కృష్ణా జలాల్లో 299 టీఎంసీలు సరిపోతాయని అప్పుడే కేసీఆర్ ఒప్పుకుని సంతకం చేశారని గుర్తు చేశారు. అప్పట్లో కేసీఆర్ చేసిన సంతకం




ఈరోజు తెలంగా ణకు ప్రతిబంధకంగా మారిందని వివరించారు.

అలా చేస్తే అడ్డుచెప్పం: సీఎం

గోదావరి బేసిన్‌లో తెలంగాణ ప్రాజెక్టులకు ఏపీ అడ్డుపడుతున్నదని సీఎం రేవంత్ అన్నారు. గోదావరిలో హక్కుగా ఉన్న 968 టీఎంసీలు వినియోగించుకునేందుకు తమకు అనుమతి ఇవ్వాలన్నారు. కృష్ణాబేసిన్‌లో 500 టీఎంసీలు, గోదావరిలో 1000 టీఎంసీలకు ఎన్‌వోసీ ఇస్తే ఏపీ బనకచర్లకు ఎలాంటి అభ్యంతరాలు చెప్పబోమని వ్యాఖ్యానించారు. తమ ప్రాజెక్టుల్లో నీళ్లు లేకుండా మిగులు జలాలు ఉన్నాయని ఏపీ చెబుతున్నదన్నారు. కృష్ణాజలాల్లో పదేండ్లల్లో 299 టీఎంసీలు ఏనాడైనా వాడారా అని ప్రశ్నించారు. కేసీఆర్ చేసిన ద్రోహంతో ఏపీకీ నీళ్లు వెళుతున్నాయని అన్నారు. ఐదు నెలలుగా తెలంగాణ అభ్యంతరాలతోనే బనకచర్ల అనుమతిపై కేంద్రం పునరాలోచనలో పడిందన్నారు. కేసీఆర్ చేసిన పాపంతో ప్రాజెక్టులు పూర్తికాలేదనీ, దక్షిణ తెలంగాణలో ప్రాజెక్టులు పూర్తిచేయకుండా కేసీఆర్ ద్రోహం చేశారని వ్యాఖ్యానించారు.

చంద్రబాబుకు అల్టిమేటంఏపీ సీఎం చంద్రబాబుకు తెలంగాణ సీఎం రేవంత్ అల్టీమేటమ్ ఇచ్చారు. కేంద్రంలో పలుకుబడి ఉంది కదా అని అన్ని ప్రాజెక్టులకు అనుమతులు వస్తాయని అనుకోవద్దు..అది భ్రమే అవుతుంది. బనకచర్లను ఎలా అడ్డుకోవాలో తమకు తెలుసని సీఎం అన్నారు.తమ హక్కుల కోసం ఎక్కడా రాజీపడేది లేదన్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసం ఎవరితోనైనా కొట్లాడతా మన్నారు. తమ హక్కులకు అడ్డువస్తే రాజ కీయంగా పోరాడుతామనీ, న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని చెప్పారు. మోడీకి చంద్రబాబు, చంద్రబాబు మోడీకి అవసరం ఉందన్నారు. ఇద్దరు పరస్పరం సహకరించుకుంటున్నారని గుర్తు చేశారు.

ఉత్తమ్ పీపీటీ

ఏపీ సర్కారు నిర్మించతలపెట్టిన గోదావరి–బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అఖిలపక్ష ఎంపీలకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 'గోదావరి–బనకచర్లపై అన్ని పార్టీలతో చర్చలు జరుపుతున్నాం. రాష్ట్ర రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. గోదావరి–బనచర్యలపై ఏపీ ప్రభుత్వం కేంద్రానికి పీజిబులిటీ నివేదిక సమర్పించింది' అని వివరించారు.

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి?

సీఎం రేవంత్‌రెడ్డి నేడు ఢిల్లీ వెళ్లే అవకాశముంది. రెండు రోజుల పాటు ఆయన అక్కడ పర్యటించ నున్నట్టు సమాచారం. కాంగ్రెస్ అగ్రనేతలను సీఎం కలిసే వీలుంది. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, కార్పొరేషన్ చైర్మెన్ల ఎంపికపై వారితో రేవంత్‌రెడ్డి చర్చించే అవకాశముంది. మరోవైపు బ్రిటన్ మాజీ ప్రధాని టోనీబ్లెయిర్, ఇతర అధికారులను సీఎం కలవనున్నట్టు సమాచారం.

# మావోయిస్టులకు మరో దెబ్బ




అమరావతి:అమృత్ తెలంగాణ: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌లో భాగంగా మావోయిస్టులకు వరుసగా ఎదురుదెబ్బలు తగులుతూనే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో బుధవారం జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు సీనియర్ మావోయిస్టు నేతలు ప్రాణాలు కోల్పోయారు. ఆంధ్రప్రదేశ్ గ్రేహౌండ్స్, సీఆర్‌పీఎఫ్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు జరిపిన సంయుక్త ఆపరేషన్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు, ఆంధ్ర–ఒడశా సరిహద్దు ప్రత్యేక జోన్ కమిటీ కార్యదర్శి గజర్ల రవి అలియాస్ ఉదరు, ప్రత్యేక జోనల్ కమిటీ సభ్యురాలు, తూర్పు డివిజన్ కార్యదర్శి వెంకట లక్ష్మీ చైతన్య అలియాస్ అరుణతో పాటు మరో నాయకుడు అంజు హతమయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో మారేడుమిల్లి, రంపచోడవరం మధ్య ఉన్న కింటుకూర గ్రామ సమీపంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఘటనా స్థలంలో ఉన్న 16 మంది మావోయిస్టులకు, దళాలకు మధ్య 25 నిమిషాల పాటు ఎదురు కాల్పులు జరిగాయని పోలీసు వర్గాలు తెలిపాయి. కాల్పులు ఆగిపోయిన తర్వాత ఆ ప్రదేశం నుంచి భద్రతా దళాలు మూడు మృతదేహాలను స్వాధీనం చేసుకున్నాయి. పారిపోయిన మిగిలిన మావోయిస్టుల కోసం అటవీ ప్రాంతంలో గాలింపు కొనసాగుతోంది. ఇదిలావుండగా సుక్మా జిల్లాలో ఛత్తీస్‌గఢ్ సరిహద్దు సమీపంలో మరో ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు మావోయిస్టులు చనిపోయారు. సంఘటనా స్థలం నుంచి రెండు ఏకే–47 తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. అక్కడ కూడా కూంబింగ్ కొనసాగుతోంది.

శాంతి చర్చల్లో భాగస్వామి

ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన గిజర్ల రాజుకు ఉదరు, గణేష్, బిరుసు అనే పేర్లు కూడా ఉన్నాయి. ఈయన తెలంగాణలోని భూపాలపల్లి జిల్లా వెలిసెల గ్రామానికి చెందిన వారు. ఈ ప్రాంతంలో పేరున్న మావోయిస్టు నేతలలో ఉదరు ఒకరు. ఈయనపై పాతిక లక్షల రూపాయల రివార్డు ఉంది. గత నాలుగు దశాబ్దాలుగా ఆయనకు మావోయిస్టు ఉద్యమంతో సంబంధాలు ఉన్నాయి. 2004–05లో అప్పటి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంతో జరిగిన శాంతి చర్చల్లో ఉదరు కూడా పాల్గొన్నారు. గతంలో ఆయన మల్కాన్‌గిరి, కోరాపుట్, శ్రీకాకుళం సహా పలు ప్రాంతాలకు ఇన్‌చార్జిగా పనిచేశారు. గెరిల్లా యుద్ధ తంత్రంలోనూ, ఐఈడీ వినియోగంలోనూ సిద్ధహస్తుడని పేరు. మధుమేహంతో బాధపడుతున్నప్పటికీ ఆటవీ ప్రాంతంలో కార్యకలాపాలకు నేతృత్వం వహించారు.

భర్త చనిపోయిన ఐదు నెలలకే

ఎన్‌కౌంటర్‌లో మరణించిన అరుణ కేంద్ర కమిటీ సభ్యుడు చలపతిని వివాహం చేసుకున్నారు. ఆయన కూడా జనవరిలో ఛత్తీస్‌గఢ్–ఒడిశా సరిహద్దులో భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. అరుణ విశాఖపట్నం జిల్లా కరక్వాని పాలెం గ్రామానికి చెందిన వారు. ఆమెపై ఇరవై లక్షల రూపాయల రివార్డు ఉంది. మావోయిస్టు మహిళా విభాగంలోనూ, మిలిటరీ సమన్వయంలోనూ ముఖ్యపాత్ర పోషించారు. కాగా రామచంద్రాపురం మండలంలోని కొయ్యలగూడెం, కిట్టుకూరు గ్రామాల మధ్య కూడా ఎన్‌కౌంటర్ జరిగిందని సమాచారం అందుతోంది. అయితే వివరాలు ఇంకా తెలియరాలేదు. రవి, అరుణల మృతితో ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రత్యేక జోనల్ కమిటీకి పెద్ద ఎదురుదెబ్బ తగిలిందని అధికారులు తెలిపారు.

## తెలుగు అమ్మాయిని టాలెంట్ గుర్తించాల్సిందే..!



టాలీవుడ్ లో సైడ్ రోల్స్ తో పాటుగా చిన్న సినిమాల్లో హీరోయిన్ గా చేస్తూ మెప్పిస్తున్న భామ పూజిత పొన్నాడ. తెలుగు అమ్మాయి అయిన పూజిత రంగస్థలం లో ఆది పినిశెట్టి లవర్ గా కనిపించి అలరించింది. అందం అభినయం ఉన్నా సరే అమ్మడికి లక్ కలిసి రావట్లేదు. ఆమె చేస్తున్న సినిమాలేవి ఆడియన్స్ కి పెద్దగా రిజిస్టర్ అవ్వట్లేదు. వచ్చిన అర కొర అవకాశాలనే చేస్తూ కెరీర్ వెళ్లదీస్తుంది అమ్మడు. సినిమాల కన్నా ఫోటో షూట్స్ తో ఎక్కువ క్రేజ్ తెచ్చుకుంటుంది పూజిత. అందుకే అమ్మడి సోషల్ మీడియా ఫాలోవర్స్ కూడా ఎక్కువగానే ఉన్నారు. తరచూ తన లేటెస్ట్ ఫోటో షూట్స్ తో ఫాలోవర్స్ ని అలరిస్తుంది పూజిత. అయితే తన గ్లామర్ సైడ్ కన్నా తన క్యూట్ లుక్స్ తో ఆడియన్స్ ని ఎట్రాక్ట్ చేస్తుంది. లేటెస్ట్ గా అమ్మడు బీచ్ లో శారీ లుక్ లో ఫోటో షూట్ చేసింది. అది చూసిన కుర్రాళ్లు పూజిత నా హృదయ దేవత నువ్వే అంటూ కామెంట్స్ చేస్తున్నారు. వైట్ కలర్ శారీలో వావ్ అనిపించేలా అమ్మడి అందాలు కేక పెట్టిస్తున్నాయి. సరైన ఛాన్స్ వస్తే చాలు తన టాలెంట్ ఏంటో చూపించాలని చూస్తున్న పూజిత పొన్నాడకి అలాంటి అవకాశం రావట్లేదని చెప్పొచ్చు. లాస్ట్ ఇయర్ ఓదెల రైల్వేస్టేషన్ సినిమాలో సెకండ్ హీరోయిన్ గా నటించిన పూజిత ఆకాశ వీధుల్లో అనే సినిమాలో హీరోయిన్ గా నటించింది. ప్రస్తుతం రవితేజ రావణాసుర తో పాటుగా తమిళంలో భగవాన్ సినిమా చేస్తుంది పూజిత. తెలుగు అమ్మాయి కదా గ్లామర్ విషయంలో అడ్డు చెబుతుందేమో అనుకుంటే తను చేస్తున్న సినిమాల్లో లిప్ లాక్స్ ఇస్తూ ఫుల్ కోపరేట్ చేస్తుంది పూజిత. అలాంటిది స్టార్ ఛాన్స్ వస్తే రెచ్చిపోకుండా ఉంటుందా చెప్పండి. కానీ అలాంటి ఛాన్స్ ఒకటి ఇచ్చి ఆమెను ఎంకరేజ్ చేస్తే మాత్రం పూజిత నెక్స్ట్ లెవల్ లో ఉంటుంది.

## 'పౌజీ' కోసం వాళ్లిద్దరి మధ్యా పోటీ!




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా భారీ లవ్ అండ్ వార్ ని హను రాఘవపూడి తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా భారీ లవ్ అండ్ వార్ పౌజీ ని హను రాఘవపూడి తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. 1800 ఏళ్ల కాలం నాటి పీరియాడిక్ స్టోరీలో అద్భుతమైన లవ్ స్టోరీని ఆవిష్కరి స్తున్నాడు. ఇందులో అందమైన ప్రేమ కథతో పాటు అంతకు మించి కళ్లు చెదిరే భారీ యాక్షన్ ఎపిసోడ్లు కూడా ఉంటున్నాయి. ఇందులో డార్లింగ్ కి ప్రభాస్ కి జోడీగా ఇమ్మాన్వీని ఎంపిక చేసిన సంగతి తెలిసిందే లాంచింగ్ రోజే అమ్మడు అభిమానుల మనసులు దొచేసింది. తన అందచందాలతో నెట్టింట సంచల నమైంది. అటుపై డాన్సులో తానెంత ప్రొఫెషనల్ అన్నది ఓ వీడియో ద్వారా అర్దమైంది. అంతటి ట్యాలెం టెడ్ బ్యూటీ ఇంతకాలం ఎక్కడ ఉంది? అనే చర్చకు తెరి తీసిందంటే? ఇమాన్వీ పై ఏ రేంజ్ లో హై వచ్చిందో అర్దమవుతుంది. ఇమాన్వీలో ఇవన్నీ చూసే హను ఛాన్స్ ఇచ్చాడన్నది అంతే వాస్తవం. కంటెంట్ లో ఏది బెస్ట్ అంటే..? అయితే ఇందులో సెకెండ్ లీడ్ కూడా ఒకటుంది. ఆ పాత్ర కోసం ఇప్పటికే మృణాల్ ఠాకూర్ ను పరి శీలిస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. కానీ మృణాల్ నటిస్తే ఫ్రెష్ ఫీల్ రాదు ? అన్న ఆలోచనలోనూ హను ఉన్నాడుట. ఈ నేపథ్యంలోప్రత్యామ్నాయంగా బాలీవుడ్ బ్యూటీ దిశాపటానీని పరిశీలిస్తున్నారుట. కల్కి 2898 లో దిశా నటించిన సంగతి తెలిసిందే. తెరపై కనిపించింది కాసేపే అయినా ప్రేక్షకుల్ని ఎంగేజ్ చేసింది. ఈ నేపథ్యంలో మృణాల్ కంటే దిశా పటానీ అయితే బాగుంటుందని మేకర్స్ భావిస్తున్నారుట. అయితే ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని సమాచారం. దీంతో మృణాల్–దిశా పటానీ మధ్య ఛాన్స్ విషయంలో పోటీ కనిపిస్తుంది. మృణాల్ ఠాకూరు కూడా ఇప్పటి వరకూ ప్రభాస్ తో నటించే ఛాన్స్ రాలేదు. అలాంటి అవకాశం కోసం ఎదురు చూస్తోంది. ఇప్పుడా ఛాన్స్ వచ్చినట్లే వచ్చి చేజారుతున్నట్లు కనిపిస్తుంది.

## శ్రీలంక తీరంలో బికినీ బ్యూటీ వేషాలు

ఇటీవల సమ్మర్ హీట్ అంతకంతకు పెరుగుతోంది. దీంతో సెలబ్రిటీలంతా మాల్దీవుల ప్రయాణంలో ఉన్నారు. ఇటీవల సమ్మర్ హీట్ అంతకంతకు పెరుగుతోంది. దీంతో సెలబ్రిటీలంతా మాల్దీవుల ప్రయాణంలో ఉన్నారు. గోవా టూరిజం అంతకంతకు దిగజారుతోందని నివేదికలు ఉన్నా .. లక్ష్యద్వీప్ టూరిజాన్ని డెవలప్ చేయాలని ప్రభుత్వం పూనుకున్నా.. మాల్దీవులకు డిమాండ్ తగ్గలేదు. ఒంటరి దీవుల్లో చిల్ అయ్యేందుకు తారలు ఆసక్తిగా ఉన్నారు. అయితే ఇతరులకు భిన్నంగా నేహా శర్మ ఇటీవల శ్రీలంక తీరంలో తళుక్కున మెరిపించింది. బ్లాక్ మోనోకినిలో హృదయాలను కొల్లగొట్టింది. బీచ్ లో అందమైన భంగిమలతో నేహా శర్మ చెలరేగిపోయింది. నేహా ఫిట్‌నెస్ ఫ్రీక్ అన్న సంగతి తెలిసిందే. జిమ్‌లు స్టూడియోల వెలుపల ఎక్కువగా కనిపిస్తుంది. ఇప్పుడు కూడా జిమ్ లో కసరత్తులు చేసాకే ఇలా బీచ్ లో ప్రత్యక్షమైంది. ప్రస్తుతం ఈ ఫోటోలను యువతరం వైరల్ గా షేర్ చేస్తున్నారు. ఈసారి సీక్వెల్‌లో చించేద్దాం! కెరీర్ మ్యాటర్ కి వస్తే.. నేహా చివరిగా విజయ్ దేవరకొండఫ్యామిలీ స్టార్‌లో అతిధి పాత్రలో కనిపించింది. కానీ ఈ సినిమా ఫ్లాపైన సంగతి తెలిసిందే. టాలీవుడ్ బాలీవుడ్ లో కొన్ని పెద్ద సినిమాల్లో నటించినా కానీ నేహా శర్మ ఫేట్ మారలేదు. కాంపిటీషన్ లో ఈ భామ వెనకబడింది. నేటితరం చిల్లింగ్ గాళ్స్ రేసులో దూసుకుపోతున్నా, నేహా కేవలం మోడలింగ్ అసైన్ మెంట్స్ ఇన్ స్టా పోస్టులకు పరిమితమైంది. హేరాఫేరి 3 లో నటిస్తోందని కబురందినా కానీ ఈ సినిమా తాజా అప్ డేట్ అందలేదు.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

## వీరమల్లుతో అందాల భామ.. అంతా సిద్ధం..!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ క్రిష్ కాంబోలో వస్తున్న భారీ బడ్జెట్ మూవీ హరి హర వీరమల్లు సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. సినిమాలో ఇప్పటికే నిధి అగర్వాల్ జాక్వెలిన్ లాంటి అందాల భామలు నటిస్తుండగా మరో అందాల భామ నోరా ఫతేహి కూడా భాగం అవుతుందని తెలుస్తుంది. బాహుబలి సినిమాలో ఇరుక్కుపో సాంగ్ తో పాపులర్ అయిన నోరా ఓ పక్క బాలీవుడ్ సినిమాలతో బిజీ బిజీగా ఉంటుంది. అయితే సౌత్ నుంచి ముఖ్యంగా టాలీవుడ్ నుంచి ఏ చిన్న ఛాన్స్ వచ్చినా సరే కాదనకుండా చేస్తుంది అమ్మడు. పవన్ కళ్యాణ్ హరి హర వీరమల్లు సినిమా లో కూడా నోరా ఫతేహి రిజిస్టర్ అయ్యే రోల్ లో నటిస్తుందని తెలుస్తుంది. ఈ నెల చివరన మొదలయ్యే షెడ్యూల్ లో నోరా పాల్గొంటుందని తెలుస్తుంది. ఆమెతో కీలక సన్నివేశాలు ఈ షెడ్యూల్ లో షూట్ చేస్తారని తెలుస్తుంది. వీరమల్లు సినిమాలో తన పాత్రతో మరోసారి తెలుగు ఆడియన్స్ ని అలరించనుంది నోరా ఫతేహి. వచ్చిన ప్రతి ఛాన్స్ వదలకుండా చేస్తూ వస్తుంది నోరా. అందాల భామ బాలీవుడ్ సినిమాల్లో ఎక్కువగా స్పెషల్ సాంగ్స్ లో అలరిస్తుంది. తెలుగులో కూడా అలాంటి ఛాన్స్ లే వస్తుండటంతో ఇక్కడ కూడా తన టాలెంట్ చూపిస్తుంది. ఇక వీరమల్లు లాంటి ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ లో నటించడం ఆమె కెరీర్ గ్రోత్ కి హెల్ప్ చేస్తుందని చెప్పొచ్చు. హరి హర వీరమల్లు సినిమా క్రిష్ ఎంతో అద్భుతంగా తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తుంది. సినిమాలో ఫ్యాన్స్ అంతా సరికొత్త పవన్ కళ్యాణ్ ని చూస్తారని తెలుస్తుంది. కీరవాణి మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమాకు మ్యూజిక్ కూడా మరో హైలెట్ అయ్యేలా జాగ్రత్త వహిస్తున్నారని తెలుస్తుంది. కొన్నాళ్లుగా షూటింగ్ వాయిదా పడుతుండగా ఈసారి పవన్ సినిమా పూర్తి చేసేందుకు పూర్తి డేట్స్ ఇచ్చినట్టు తెలుస్తుంది. ఏ.ఎం.రత్నం నిర్మిస్తున్న ఈ సినిమా పవర్ స్టార్ ఫ్యాన్స్ అందరిని మెప్పించేలా చేస్తుందని అంటున్నారు. ఈ సమ్మర్ రిలీజ్ ప్లాన్ చేస్తున్న ఈ సినిమా సమ్మర్ కి కుదరకపోతే దసరాకి వాయిదా వేసే ఛాన్స్ ఉందని టాక్.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com